క్లుప్తంగా

ఓబీసీ రుణ లబ్ధిదారుల ఎంపిక

కురిచేడు: మండలంలో ఈ ఏడాదికి ఓబీఎం ఎంఎస్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఎంపిక ప్రక్రియ మంగళ, బుధవారాల్లో జరుగుతుందని ఎంపీడీఓ సతీష్‌బాబు తెలిపారు. బ్యాంకు అధికారుల సమక్షంలో రుణాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఏపీజీబీ, కెనారా బ్యాంకు, యూనియన్ బ్యాంకు పెద్ద వరం, దేకనకొండ, పడమర గంగవరం, పడమర నాయుడుపాలెం, ఆవులమంద, బోధనంపాడు గ్రామాల అభ్యర్థులకు, బుధవారం ఏపీజీబీ, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు మేనేజర్ల సమక్షంలో కల్లూరు, కురిచేడు, పొట్లపాడు, పడమర వీరాయపాలెం గ్రామాల అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంఈఓ-1 సుబ్బయ్య

తాళ్లూరు: అంగనవాడీ కార్యకర్తలకు రెండు విడతలుగా జ్ఞాన జ్యోతి శిక్షణ స్థానిక వీకే ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నుంచి ఇవ్వనున్నట్లు ఎంఈఓ-1 సుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో పూర్వ ప్రాథమిక విద్యపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మొత్తం ఆరు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ-2 సుధాకర్‌రావు తెలిపారు. విద్య, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన అధికారులతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీకేజీహెచ్‌ఎస్ హెడ్ మాస్టర్ శేషగిరిరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటో..బైకు ఢీ

- ఒకరికి గాయాలు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని పోలవరం సమీపం బాబుమీయా డెయిరీ వద్ద ఆటో.. ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. అద్దంకి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అద్దంకి నుంచి ముండ్లమూరు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో సింగన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం అద్దంకి తరలించారు. అక్కడి నుంచి ఒంగోలు తీసుకెళ్లినట్లు సమాచారం.

బాలోత్సవ్‌లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ



ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని

గిద్దలూరు(బేస్తవారిపేట): ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవ్‌లో గిద్దలూరు విశ్వభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 12 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనపరిచారు. రైతే రాజు ప్రదర్శనకు మొదటి బహుమతి, కథారచనలో ప్రశాంత్ మొదటి బహుమతి, విచిత్ర వేషధారణలో గంటా హన్విత ద్వితీయ, సైన్స్ ప్రాజెక్ట్‌లో ద్వితీయ, కోలాటంలో ప్రథమ, స్పెల్‌బీలో నసీఫా అత్తిక ద్వితీయ, మ్యాప్ పాయింటింగ్‌లో గురు చరిత ద్వితీయ, ఉర్దూ వ్యాసరచనలో ప్రథమ, ఉర్దూ డిబేట్‌లో ఎస్‌కే ఆఫ్రిన్, పట్టణ వ్యవసాయం-నూతన ఆవిష్కరణలో శివానంద ప్రథమ, కథారచన విభాగంలో జాస్మిన్ ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఎస్పీ దామోదర్ చేతులమీదుగా ప్రశంసపత్రాలు అందుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి, ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్యానికి భరోసా ఏది?

- పంచాయతీల్లో కనిపించని వివాహ నమోదు ప్రక్రియ
- కార్యదర్శులకు, ప్రజల్లో కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట



పాఠశాలలో చదువుకుంటున్న బాలికలు (ఫైల్)



గ్రామ సచివాలయం

పుల్లలచెరువు:

అడుగుడుగునా నిర్లక్ష్యం..అంతులేని జాప్యంతో చట్టం తన పని తాను చేసుకోవడం లేదు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని నెత్తి నోరుకొంటుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు తప్పని సరని ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో గ్రామీణుల్లో అవగాహన లోపంతో నేటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతునే ఉన్నాయి. వివాహ నమోదు తప్పని సరి చేయాలని 2002 చట్టం చేశారు. జీఓ-193 ప్రకారం ప్రతి గ్రామంలో వివాహాల నమోదును కార్యదర్శులు చేయాలని చట్టం రూపొందించారు. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా 2012 క్యాబినేట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి రిజిస్ట్రేషన్ చట్టం వర్తించేలా రూపొందించారు.

అవగాహన లోపం

వివాహ రిజిస్ట్రేషన్ నమోదుపై కార్యదర్శులకు అంతగా అవగాహన లేక పోవడంతో గ్రామాల్లో ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని చెప్పవచ్చు. కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప వీటిపై అవగాహన అంతగా లేదంటున్నారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు తప్పని సరిగా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

పంచాయతీల్లో నమోదు

వివాహం జరిగిన పంచాయతీల్లోనే కార్యదర్శులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. జనన, మరణ ధ్రువపత్రాల మాదిరిగానే వివాహ రిజిస్ట్రేషన్ నమోదు పత్రాలు పొందొచ్చు. వివాహం జరిగిన 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. 30 రోజుల తర్వాత కూడా రోజుకు వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జరుగుతున్న బాల్య వివాహాలు

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతునే ఉన్నాయి. ఆర్థిక సమస్యలు, అవగాహన లోపంతో గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల్లో పూర్తిగా చైతన్యం లోపించింది. ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాలు బాల్య వివాహాలతో చీకటిమయమవుతున్నాయి. బాల్య వివాహాలను గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీలు అడ్డుకుంటున్నా ఇంకా అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

వివాహం చేసుకునే ముందు వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనలను అధికారులు అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే తప్ప ఐసీడీఎస్ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వీటిపై పంచాయతీ వారు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి



బాల్య వివాహాలపై సంబందింత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో, కాలేజీల్లో, తల్లిదండ్రులకు ఇలా ప్రతి ఒక్కరికీ బాల్య వివాహాలపై అవగాహన తప్పని సరి. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక పోవడంతో పదో తరగతి పాసైన వెంటనే బాల్య వివాహాలు చేస్తున్నారు. వివాహాలు చేసే వారు తప్పనిసరిగా పంచాయతీల్లో నమోదు చేయాలని నిబంధనలు కఠినతరం చేస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చు.

– ఎల్.రాములు, ఎంపీటీసీ, పుల్లలచెరువు

వైభవంగా శివపార్వతుల కళ్యాణం



శివ పార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

- కళ్యాణ మహోత్సవానికి భారీగా హాజరైన భక్తులు
- కళ్యాణంతో పాటు విళక్కి కార్యక్రమం నిర్వహణ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కళ్యాణంతో పాటు శివస్వాముల విళక్కి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు రామప్రసాదశర్మ ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి పట్టణానికి చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రణవ పంచాక్షరీ, ఓం నమశ్శివాయ ఏకాహం, సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యావచనం, మండపార్చన కార్యక్రమాల నడుమ కళ్యాణం నిర్వహించారు. కళ్యాణంలో పట్టణానికి చెందిన పుణ్య దంపతులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు రాంప్రసాదశర్మ మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, అష్టదశ శక్తి పీఠాల్లో ఒక్కటైన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వెలిసిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న మండల కేంద్రంలోని ఆలయంలో లోక కళ్యాణార్థం శివ పార్వతుల కళ్యాణం, లక్షాదీపోత్సవం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

అలరించిన శివదీక్ష పడిపూజ

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శివదీక్ష పడిపూజ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమాన్ని శివస్వాములు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని శివస్వాములు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. మండపంలో శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి వార్ల విగ్రహాలను అలంకరించి స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో నిర్వహించిన భజనతో పరిసర ప్రాంతం మార్మోగింది.

బాలోత్సవంలో బాలికకు అవార్డు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న శ్రీనివాసరావు

ముండ్లమూరు (కురిచేడు): ఒంగోలులో జరిగిన బాలోత్సవం ద్వితీయ పిల్లల పండగ కార్యక్రమంలో జూనియర్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థినికి కంఠస్థ పద్యాల్లో అవార్డు లభించింది. మండలంలోని కట్టసింగన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రామిసెట్టి వెంకటలక్ష్మికి తృతీయ బహుమతి లభించింది. క్లస్టర్ చైర్మన్ ప్రకాశ్‌రావు విద్యార్థినిని అభినందించి భరతమాత చిత్రపటాన్ని బహూకరించారు. విద్యార్థినిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణుని ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు సయ్యద్ సుభానీ, సీహెచ్ హైమావతి అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో వైద్య సేవలు కరువు

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వంలో వైద్య సేవలు ప్రజలకు దూరమవుతున్నాయని ఎంపీజే అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఎంపీజే బృందంతో కలిసి జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌లో 80 మంది డాక్టర్లు ఉన్నారని, రోజుకు 700 వరకు ఓపీ వచ్చేదని అని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రస్తుతం 19 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారని, ఓపీల సంఖ్య సగానికి పైగా పడిపోయిందన్నారు. ఐసీయూ కూడా లేదని, గతంలో ఉన్న సదుపాయాలు కనుమరుగయ్యాయన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా నిలిచిపోయిందన్నారు. వైద్యసేవలను పునరుద్ధరించడంతోపాటు మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రారంభించకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీజే నాయకులు నాగూర్ మీరావలి, అబ్దుల్ రసూల్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

వికలాంగ డీలర్‌పై కక్ష సాధింపు



డీలర్ రమణారెడ్డి

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుడైన రేషన్ డీలర్‌పై కక్ష సాధింపులకు దిగింది. కనికరం లేకుండా పదేపదే అతడి షాపును తనిఖీ చేస్తూ మానసికంగా వేధిస్తోంది. వివరాలు.. మండలంలోని చింతలపాలేనికి చెందిన సారెడ్డి రమణారెడ్డి (వికలాంగుడు) 20 ఏళ్ల నుంచి రేషన్ షాప్ (0815020) డీలర్గా వ్యవహరిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల నుంచి నెలకు రెండు మూడు సార్లు షాపును తనిఖీ చేస్తూ ఉద్దేశ పూర్వకంగా ఆయన్ను ఇబ్బంది పెడుతున్నారు. స్టాక్‌లో ఎటువంటి తేడాలు లేకున్నా పదేపదే తనిఖీలు చేస్తూ ఆయన్ను ఇబ్బంది పెడుతున్నారు. వికలాంగుడు కావడంతో తన ఇంట్లోనే షాపు నిర్వహించుకుంటున్నాడు. ఈ నెల రేషన్ పంపిణీలో భాగంగా 11, 12వ తేదీల్లో మొత్తం 16 క్వింటాళ్ల 31 కిలోల రేషన్ బియ్యం ఎండీఎం బండి వారికి ఇచ్చారు. గ్రామంలో పంపిణీ చేసింది 12 క్వింటాళ్ల 90 కిలోల బియ్యం. ఎండీఎం బండి వారి దగ్గర మిగిలిన బియ్యం 3 క్వింటాళ్ల 41 కేజీలు మాత్రమే. కానీ బండి వారు అతనికి రిటర్న్ ఇచ్చింది 5 క్వింటాళ్ల 37 కేజీల బియ్యం. బండి వారి దగ్గర క్వింటా 96 కేజీలు అధికంగా ఉన్న బియ్యం అంత్యోదయ కార్డు కలిగిన వికలాంగుడైన అతను ఇంట్లో తినడం కోసం ఉంచుకున్న బియ్యం కలిపి 2 కింటాళ్ల 86 కిలోల బియ్యం ఎక్కువగా ఉన్నాయని అధికారులు హడావుడి చేశారు. ఉద్దేశ పూర్వకంగా తనపై తప్పు రుద్ది షాప్‌లో ఉన్న స్టాకును బొద్దికూరపాడు వీఆర్‌ఏకి అప్పగించారని డీలర్ రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వికలాంగుడైన తనపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు సరికాదన్నారు. భార్యను కోల్పోయిన తాను పిల్లలను చూసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని, తగు విచారణ జరిపించి న్యాయం జరిగేలాగా చూడాలని ఆయన అధికారులను కోరుతున్నాడు.

కారు..బైకు ఢీ

- ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు (కురిచేడు): ఎదురెదురుగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పొలవరం వద్ద సోమవారం జరిగింది. వివరాలు.. ముండ్లమూరు నుంచి అద్దంకి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అద్దంకి నుంచి ముండ్లమూరు వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో పొలవరానికి చెందిన నరసింహారెడ్డి, మురళిలకు గాయాలయ్యాయి. వీరు, ద్విచక్ర వాహనంపై ముండ్లమూరులో పనులు ముగించుకుని స్వగ్రామం వస్తున్నారు. గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న చేపల చెరువు వద్ద ప్రమాదం జరిగింది. 108కి సమాచారం అందించడంతో సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అద్దంకి వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లాలని సిఫార్స్ చేశారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య



విశిష్ట నంబర్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య తీసుకొచ్చిందని వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి తెలిపారు. మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి, దేవరాజుగట్టు గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్లో రైతుగా నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతులకు ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా పథకాలను పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావొచ్చన్నారు. ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్‌తో జారీ చేసే ఈ కార్డులతో రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ పథకాలు, ఇతర సేవలు పొందేందుకు ఇది అధికార గుర్తింపుగా పని చేస్తుందన్నారు. రైతు ఐడీ నుంచే ప్రయోజనాలు నేరుగా రైతుకే చేరుతాయని, నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీలు, పంట రుణాలు, పంట బీమా పథకాలు పొందేలా చూస్తుందన్నారు. రైతు సేవా కేంద్రానికి వచ్చి ఆధార్ కార్డు, ఆధార్ లింక్ నంబరు, పట్టాదారుని పాస్‌పుస్తకం జిరాక్స్ కాగితాలు తీసుకొని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. రైతు మొబైల్ నంబర్‌కు మూడు సార్లు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేస్తే రైతు యూనిక్ ఐడీ దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఆమె వెంట వీఏఏలు ఆదిలక్ష్మి, లాలూనాయక్, చిన్నా, రైతులు ఉన్నారు.

వెలుగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



దొనకొండలో కరపత్రాలతో రైతులు

దొనకొండ: పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి మొదటి టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయాలని రైతు సంఘ మండల నాయకులు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రైతులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మండలంలో 19 గ్రామాల్లో 17 వేల ఎకరాలు సాగు భూమికి పారుదల వెలుగొండ ప్రాజెక్టు డిజైన్‌లో ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన దొనకొండ ప్రాంతానికి సాగు, తాగు నీరు వచ్చి, భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు నీరు అందించవచ్చని ఇంజినీర్లు గతంలో తెలిపారని, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం ఉంటుందని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసి సుమారు 30 ఏళ్లయినా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేసి తాగు నీరు అందిస్తామన్నారని, 10 నెలలు దాటినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేసిన మొదటి టన్నెల్ నుంచి నీరు విడుదల చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రచార కార్యక్రమంలో పి.కోటయ్య, కె.వెంకటేశ్వర్లు, దాసరి కోటేశ్వరరావు, దావీదు, మేకల నరసింహారావు, బ్రహ్మయ్య, చిన్నకాశిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల దొడ్ల ఆక్రమణపై ఫిర్యాదు

- నిందితులపై చర్యలు తీసుకోవాలి
- సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు రైతుల వినతి

మార్కాపురం టౌన్: తమ పశువుల దొడ్ల స్థలాలను అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు పలువురు రైతులు వినతిపత్రం అందించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దారవీడు మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు 80 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న 87 సెంట్ల భూమిని కొందరు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని, ఇదేమని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. సొంత మండలాల్లో పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యర్రగొండపాలెం మండలానికి చెందిన మూడమంచు పెద్ద బ్రహ్మయ్య వినతిపత్రం ఇచ్చారు. యర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఒక రెవెన్యూ అధికారి రూ.లక్షల్లో ముట్టజెప్పి ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా పోస్టింగు వేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ అధికారిది సొంత మండలం కావడంతో గతంలో ఆర్‌ఐగా పనిచేసిన సమయంలో భూముల అవకతవలకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

- అంగన్‌వాడీల ధర్నా

సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

యర్రగొండపాలెం: అంగన్‌వాడీలకు సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ గతంలో తమ న్యాయపరమైన కోర్కెల సాధన కోసం అంగన్‌వాడీలు సమ్మె చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. స్వయంగా సీఎం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీలు కోరుతున్నారన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేవిధంగా జరగబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని కోరారు. తొలుత తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకురాళ్లు మల్లేశ్వరి, అరుణ, సుబ్బమ్మ, సునీత, బేబీరాణి, సుజాత, సుభాషిణి, నాగరాజకుమారి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచి గ్రాట్యూటీ అమలు చెయ్యాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కెన్నెర శాంతికి వినతిపత్రం అందజేసి ధర్నా చేశారు. రాష్ట్రంలోని పేద గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అనేక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు 2024 జూలై నుంచి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనంగా 26 వేల రూపాయలు ఇవ్వాలని, దీంతో పాటు రాష్ట్రంలోని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చెయ్యాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చి అమలు చెయ్యాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు యక్కంటి సుబ్బమ్మ, షేక్ ముంతాజ్, వెంకటలక్ష్మి, వెంకట రత్నమ్మ, నాగమల్లేశ్వరి, సత్తిబాయి, వెంకటమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.



పెద్దదోర్నాల: తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న అంగన్‌వాడీలు



వై.పాలెం: ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు